క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట) : ఐదో విడత వైఎస్సార్ నేతన్న నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తిరుపతి జిల్లా వెంకటగిరికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎమ్మెల్యే ప్రసన్నకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యేకు పూలమొక్కను అందజేస్తున్న వీరి చలపతిరావు

కొడవలూరు : నెల్లూరు జిల్లా డీసీఎంఎస్ చైర్మన్‌గా వీరి చలపతిరావు పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించిన నేపథ్యంలో ఆయన కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్కను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు రాష్ట్ర వ్యవసాయ సలహామండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డి, ఇందుకూరుపేట కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, నిడిముసలి సొసైటీ చైర్మన్ కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

బీఎల్వోల ఇంటింటి సర్వే



వెంకటాచలం: మండలంలోని ఇడిమేపల్లి, ఈదగాలి, గొలగమూడి, ఇస్కపాళెం, చెముడుగుంట గ్రామాల్లో శుక్రవారం బూత్ లెవల్ అధికారులు(బీఎల్వోలు) ఇంటింటి సర్వే చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించి పేర్లు ఉన్నాయా, అడ్రస్ సవరణలు, కొత్తగా ఓటు హక్కు పొందేందుకు అర్హత కలిగిన వ్యక్తులు ఉన్నారా.. అని అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగి ఓటరు జాబితాలో పేరు లేకుండా ఉంటే నమోదు చేస్తామని తెలియజేశారు.

ఆక్రమణలనే తొలగించాం


• తహసీల్దార్ హమీద్

తోటపల్లిగూడూరు : మండలంలోని మాచర్లవారిపాళెంలో గురువారం ఆక్రమణలను మాత్రమే తొలగించామని తహసీల్దార్ హమీద్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ మాచర్లవారిపాళెంలో రోడ్డు పోరంబోకు స్థలంలో కొందరు దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారన్నారు. వీటి కారణంగా రోడ్డులో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే పంచాయతీ అధికారులతో కలిసి పరిశీలించామని, రోడ్డుపై ముందుకు చొచ్చుకొచ్చిన ఓ దుకాణాన్ని తొలగించామన్నారు. అయితే సదరు ఆక్రమణదారులు కొండయ్య, వెంకయ్య తమను అడ్డగించే ప్రయత్నం చేసి, మీడియాలో పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేశారన్నారు. వారు చేసిన ఆరోపణల్లో నిజం లేదని, నిబంధనల మేరకే ఆక్రమణలను తొలగించామని తహసీల్దార్ హమీద్ స్పష్టం చేశారు.

సీసీఆర్ కార్డులను మంజూరు చేయాలి

కొడవలూరు: మండలంలోని ప్రతి కౌలు రైతుకు సీసీఆర్ కార్డు విధిగా మంజూరు చేయాలని ఏఓ లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. వీఏఏ, వీఆర్వోల సమన్వయంతో కౌలు రైతులను గుర్తించి సీసీఆర్ కార్డు మంజూరు చేయాలని జేసీ ఆదేశించి ఉన్నారని తెలిపారు. కౌలు రైతులు పంట రుణాలు పొందాలన్నా, రైతు భరోసాకు అర్హులు కావాలన్నా, వ్యవసాయ శాఖ రాయితీలు పొందాలన్నా విధిగా సీసీఆర్ కార్డు ఉండాలన్నారు. ఇప్పటివరకు సీసీఆర్‌సీ పొందని కౌలు రైతులుంటే వెంటనే సంబంధిత వీఆర్వో లేక ఆర్బీకేలోని వీఏఏలను సంప్రదించాలని కోరారు.

నేదురుమల్లిలో సీసీరోడ్ల నిర్మాణం



పొదలకూరు : మండలంలోని నేదురుమల్లి పంచాయతీలో సిమెంటురోడ్ల నిర్మాణం ముమ్మరంగా జరుగుతున్నాయి. మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి చొరవతో నుడా నిధులు రూ.30 లక్షలను పంచాయతీకి విడుదల చేయడంతో నేదురుమల్లితో పాటు మజరా గ్రామం యర్రబల్లిలో కూడా సిమెంటురోడ్లను నిర్మిస్తున్నట్లు సర్పంచ్ ఉడతా రమేష్ పేర్కొన్నారు.



బ్రాహ్మణ మహిళలకు పసుకు కుంకుమ వస్త్రాలను అందజేస్తున్న కౌన్సిలర్



కుంకుమార్చనలో పాల్గొన్న రుత్వికులు

వైభోగం.. మహాయజ్ఞం

• విశేషంగా తరలివచ్చిన భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో కోటి కుంకుమార్చన మహాయజ్ఞం శుక్రవారం వైభవంగా జరిగింది. ఉదయం తీర్థ సంగ్రహణం, లక్ష్మీ గణపతి పూజ, కలశస్థాపన, రుత్విగ్వరణం, దీక్ష ధారణ, గోపూజ, నందీశ్వరపూజ, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రవారాభిషేకం, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పూజ, శ్రీచక్ర మహా నవావరణ పూజలను నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై దాదాపు 100 మంది రుత్వికుల చేత కోటి కుంకుమార్చన మహాయజ్ఞ కార్యక్రమాన్ని జరిపించారు. రాత్రికి గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జున స్వామికి కల్యాణం, కొమారీ పూజ, సుహాసిని పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా కాత్యాయని ఇన్‌ఫ్రా అండ్ డెవలప్‌మెంట్ అధినేత తమ్మినేని మల్లికార్జుననాయుడు దంపతులు వ్యవహరించగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, పాలకమండలి సభ్యులు నందకుమార్, రఘు రామయ్య, శివకుమార్, పద్మమ్మ, సుప్రజ, కామేశ్వరి, విమలమ్మ, శశిశేఖర్‌శర్మ, ఉభయకర్త పాల్గొన్నారు.



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు



కోటి కుంకుమార్చనలో ఉభయకర్తలు, ఆలయ చైర్మన్

గ్రామస్థాయిలో విద్య, వైద్య రంగాలు పటిష్టం



సీసీరోడ్డును ప్రారంభిస్తున్న కలెక్టర్ హరినారాయణన్, ఎమ్మెల్యే ప్రసన్న

• కలెక్టర్ హరినారాయణన్

ఇందుకూరుపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయిలో విద్య, వైద్య రంగాలను పటిష్టంగా అమలు చేస్తున్నట్లు కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. మండలంలోని పున్నూరు గ్రామంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి కలెక్టర్ పలు అభివృద్ధి పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం నేడు ఆచరణలో సాధ్యం సాధ్యమవుతోందన్నారు. గ్రామస్థాయిలో ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేయడంతో పరిపాలన ప్రజలకు మరింత చేరువైందన్నారు. రూ.40 లక్షలతో సచివాలయ భవనం, రూ.37 లక్షలతో సీసీరోడ్డును ప్రారంభించడం సంతోషకరంగా ఉందన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేశారన్నారు.

తక్షణమే స్పందించే కలెక్టర్

ప్రజా సమస్యలపై కలెక్టర్ హరినారాయణన్ తక్షణమే స్పందిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చేలా అధికారులు పని చేయాలని కోరారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్‌ను వారు పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీఏఏబీ చైర్మన్ డి.నిరంజన్‌బాబురెడ్డి, డీసీఎమ్మెస్ డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి, పార్టీ నేతలు బట్టేపాటి నరేంద్రరెడ్డి, గొల్లపల్లి అవినాష్, ఎంపీటీసీ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్యలపై అప్రమత్తత అవసరం

• వీఎస్‌యూ వీసీ జీఎం సుందరవల్లి

వెంకటాచలం: కంటి సమస్యలపై విద్యార్థులకు అప్రమత్తత అవసరమని వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి సూచించారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ సౌజన్యంతో వీఎస్‌యూ సోషల్ వర్క్ విభాగం, ఆంధ్ర విద్యార్థి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. దీనిని వీసీ సుందరవల్లి ప్రారంభించి, మాట్లాడారు. కంటిపరమైన సమస్యలను ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ముఖ్యంగా విద్యార్థులు కంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో చాలా ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ సహకారంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్ బాబు, సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ సునీత, డాక్టర్ మధుమతి, ఆంధ్ర విద్యార్థి సంఘం నేతలు తురకా ప్రసాద్, సృజన్, హైమావతి, వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వీసీ సుందరవల్లి

రెడ్డిపాళెంలో 'ఫ్యామిలీ డాక్టర్'

కొడవలూరు : మండలంలోని రెడ్డిపాళెంలో కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఓపీ ద్వారా పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం గ్రామంలోని ఇద్దరు గర్భిణుల ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి సూచనలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బృహత్తర కార్యక్రమం ఫ్యామిలీ డాక్టర్ అని తెలిపారు. ఇంటి వద్దకే వైద్యులు వచ్చి సేవలందిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎస్ వి.రామ్మోహన్, ఎంఎల్‌హెచ్‌పీ సీహెచ్.సుష్మ, హెచ్‌ఏలు ఎ.వెంకట్రావు, జి.నదియ, ఆశా కార్యకర్త ఈ.పద్మ పాల్గొన్నారు.



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి హాజరైన వైద్య సిబ్బంది

వసతులపై మసీదుల సందర్శన

పొదలకూరు : 'హర్ దిల్‌మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్ సాత్' కార్యక్రమంలో భాగంగా మండల వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు మసీదులను సందర్శించారు. తాటిపర్తి, మహ్మదాపురం, ప్రగతినగర్, సూరాయపాళెం, నావూరు, ఆల్తుర్తి, మొగళ్లూరు మసీదులను సందర్శించి మసీదులకు అవసరమైన వసతులపై మతపెద్దలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు గోగిరెడ్డి గోపాల్ రెడ్డి, ఎన్.నరసింహులు, జిల్లా వక్ఫ్‌బోర్డు జాయింట్ సెక్రటరీ ఎస్కే ఖాదర్, మైనారిటీ నేతలు సయ్యద్ హంజాహుస్సేని, కో–ఆప్షన్ సభ్యుడు దస్తగిరి, కోనం బ్రహ్మయ్య, వాకాటి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



హర్ దిల్‌మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్ సాత్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న నేతలు

ఎమ్మెల్యే ప్రసన్న ఆపన్నహస్తం



ఫిక్స్‌డ్ డిపాజిట్ల బాండ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

ఇందుకూరుపేట : పేదరికంతో ఇబ్బందులు పడుతున్న ఓ కుటుంబానికి ఎమ్మెల్యే ప్రసన్న ఆపన్న హస్తం అందించారు. మండలంలోని రావూరు గ్రామానికి చెందిన ప్రకాష్, పద్మావతి దంపతుల ఇద్దరు కుమార్తెలకు రూ.40 వేల సాయాన్ని నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా అందజేశారు. ఈ మొత్తాన్ని రూ.20 వేల చొప్పున ఇద్దరు చిన్నారుల పేరు మీద బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. ఈ బాండ్లను పున్నూరు గ్రామంలో ఎమ్మెల్యే ప్రసన్న శుక్రవారం వారికి అందజేశారు. అలాగే మైపాడు–నెల్లూరు రోడ్డులో పున్నూరు అంకమ్మ సత్రం వద్ద ప్రధాన రహదారిపై స్పీడు బ్రేకర్ల ఏర్పాటుకు రూ.20 వేలను ఎమ్మెల్యే అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వెంకటాచలం: సైకిల్‌ను మోటారు బైక్ ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన ఘటన వెంకటాచలం టోల్‌ప్లాజా సమీపంలో శుక్రవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. రామదాసుకండ్రిగ గ్రామానికి చెందిన గునిమిన వెంకటేశ్వర్లు(32) ఎలక్ట్రీషియన్ పని చేస్తున్నాడు. ఆయనకు భార్య స్రవంతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దంపతుల మధ్య మనస్పర్థల కారణంగా భార్య స్రవంతి రెండేళ్ల నుంచి పుట్టింట్లోనే ఉంటోంది. వెంకటేశ్వర్లు పనినిమిత్తం మోటారు బైక్‌పై నెల్లూరుకు వెళ్తుండగా టోల్‌ప్లాజా సమీపంలో ఎదురుగా వచ్చిన సైకిల్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు రోడ్డుపై పడి తలకు తీవ్రగాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే ప్రయాణికులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు వెంకటేశ్వర్లు

ప్రాథమిక దశలోనే వైద్యులను సంప్రదించండి

బుచ్చిరెడ్డిపాళెం: డయేరియా వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్యులను సంప్రదించాలని ఎస్ఎమ్ఓ భాస్కర్ అన్నారు. మండలంలోని పల్లాప్రోలు గ్రామంలో ఆయన శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాజాగా మరో రెండు డయేరియా కేసులు నమోదయ్యాయని, వారికి స్థానిక చర్చిలో చికిత్స అందిస్తున్నామన్నారు. డయేరియాను ప్రారంభ దశలోనే గుర్తించి త్వరగా కొలుకునే అవకాశం ఉంటుందని, మరొకరికి వ్యాధి సోకకుండా ఉంటుందని తెలిపారు. దీంతో పాటు గ్రామంలో పారిశుద్ధ్య పనులను మరింత మెరుగు పరచాలని కోరారు. రోగులకు నిత్యం వైద్యసేవలు అందేలా 24 గంటల పాటు వైద్యులను అందుబాటులో ఉంచుతున్నామని, వారికి అవసరమైన మందులను కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని కోరారు. ఆయన వెంట ఎంపీడీఓ పెంచలశ్యామ్, వైద్యులు ఉన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఎమ్ఓ భాస్కర్

బీమా సాయం అందజేత

మనుబోలు : మండలంలోని వడ్లపూడి గ్రామంలో కల్లుగీత కార్మికుడు ప్రమాదవశాత్తు మృతిచెందగా అతని కుటుంబానికి వైఎస్సార్ బీమా ద్వారా తక్షణ సాయం కింద రూ.10 వేలను వైఎస్సార్‌సీపీ నేత ఈగా సురేష్ శుక్రవారం అందజేశారు. గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు కోసూరు హరేంద్ర గురువారం తాటిచెట్టు పైనుంచి పడి మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో అతని కుటుంబాన్ని సురేష్ పరామర్శించి ధైర్యం చెప్పి బీమా సాయాన్ని అందించారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నేతలు బలరామయ్య, జనార్ధన్, కొండయ్య, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కట్టుబడిపాళెంలో 'జగనన్న సురక్ష'

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని కట్టుబడిపాళెంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తామని కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి జరిగే కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పాల్గొని పలువురికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారన్నారు.

రైల్లోంచి పడిన ప్రయాణికుడు

• కాపాడిన రైల్వే అధికారులు

మనుబోలు: రైల్లోంచి ప్రమాదవశాత్తూ జారిపడిన ఓ ప్రయాణికుడ్ని రైల్వే అధికారులు గుర్తించి కాపాడిన ఘటన మనుబోలు రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. అసోంలోని గువహటికి చెందిన ముకేశ్వర్ కొవార్ కేరళలోని ఎర్నాకుళంలో పని చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 19న విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరారు. బోగి మెట్లపై కూర్చొని కునుకు తీస్తూ మనుబోలు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడి స్పృహ కోల్పోయారు. గమనించిన రైల్వే మాస్టర్ మహంతి, పాయింట్స్‌మెన్ గజ్జల కృష్ణమోహన్ అతడ్ని పక్కకు తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స చేశారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి బంధువులకు సమాచారం అందించారు.



ప్రయాణికుడ్ని పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

మోటార్‌బైక్‌ల ఢీ

• ముగ్గురు యువకులకు గాయాలు



గాయపడిన యువకుడు

మనుబోలు : రెండు మోటార్ బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలైన ఘటన మండలంలోని వీరంపల్లి ఫ్లైఓవర్ వద్ద శుక్రవారం జరిగింది. వెంకటాచలం మండలం ఇడిమేపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ బైక్‌పై ఫ్లైఓవర్‌పై వస్తుండగా మనుబోలు మండలం బండేపల్లి గ్రామానికి చెందిన రాజేష్, ప్రవీణ్ బైక్‌పై మనుబోలుకు వస్తున్నారు. ఈ రెండు బైక్‌లు ఫ్లైఓవర్ వద్ద ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో చికిత్స నిమిత్తం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తూకాల్లో తేడాలొస్తే కఠిన చర్యలు

మనుబోలు : కొలతల తూకాల్లో తేడాలొస్తే కఠిన చర్యలు తప్పవని తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ సాయి శ్రీకర్ హెచ్చరించారు. మనుబోలు మండల కేంద్రంలోని పలు దుకాణాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తూనికల కొలతల పరికరాలను పరిశీలించారు. ప్రతి దుకాణదారుడు వారి తూనికల కొలతల పరికరాలను ఆ శాఖ వద్ద సమర్పించి నిబంధనలకు అనుగుణంగా వాటిని సరిచేయించుకుని ముద్రలు వేయించుకోవాలన్నారు. పరికరాలపై తమ శాఖ ముద్రలు లేకుండా వినియోగిస్తే జరిమానా తప్పదన్నారు. కాగా వీరి తనిఖీలను ముందే పసిగట్టిన పలువురు తమ దుకాణాలకు మూసివేశారు.



ఓ దుకాణంలో ఎలక్ట్రానిక్ కాటాను పరిశీలిస్తున్న అధికారులు